క్లుప్తంగా

సీడీపీఓ నాగమణికి పురస్కారం



కలెక్టర్ చేతులు మీదుగా పురస్కారం అందుకుంటున్న సీడీపీఓ నాగమణి

గజపతినగరం: సీడీపీఓ నాగమణికి కలెక్టర్ సూర్యకుమారి జిల్లాస్థాయి పురస్కారం అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఎస్పీ దీపికా పాటిల్, డీఎంహెచ్ఓ రమణకుమారి, తదితరుల సమక్షంలో అవార్డు అందజేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మకరతోరణాల ఏర్పాటు



స్వామికి అలకరించిన మకరతోరణం

వేపాడ: మండల కేంద్రంలోని కృష్ణాలయంలో దాతల సహకారంతో మకరతోరణాలు ఏర్పాటు చేసినట్లు గోపాలకృష్ణ యాదవ సంఘ సభ్యులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, ఐదుగురు దాతలు, కమిటీ సభ్యులు కలిసి శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు, ఉత్సవ విగ్రహాలకు రెండు మకరతోరణాలు తయారు చేయించినట్లు చెప్పారు.

విత్తన గుళికలతో భూ సారం



విత్తన గుళికలు తయారుచేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం ఆనందరావు, తదితరులు

పూసపాటిరేగ: విత్తన గుళికలతో భూమి సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని గోవిందపురంలో విత్తన గుళికలు తయారుచేసే విధానంపై మహిళా రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగుభూమిలో విత్తన గుళికలు వేయడం వల్ల భూ సారం పెరిగి, తర్వాత వేసిన పంటల్లో అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పి.దయాకరరావు, వి.కమల, పి. దుర్గ, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్‌డీసీ సుదర్శన్ దొర

జామి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్ దొర బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌లలో ఏర్పాటు చేయాల్సిన వసతులపై సిబ్బందికి సూచనలు చేవారు. ఆయన వెంట తహసీల్దార్ హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం



జె.గుమడాంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

బొండపల్లి: నవ ధ్యానాలు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ ఎన్.రామకృష్ణ అన్నారు. మండలంలోని జె.గుమడాంలో నవ ధాన్యాలు సాగుపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ పంటలు సాగు చేయడానికి ముందుగా నవధాన్యాలు సాగు చేయాలన్నారు. 40 రోజుల తర్వాత ఎదిగిన పంటను కోత కోసి పశువులకు దాణాగా వేయవచ్చని, మిగిలిన వాటిని బాగా కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ నూకరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి గోవింద, రైతులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

కొత్తవలస: అరకు – విశాఖ జాతీయ రహదారిలో ఎస్సై బొడ్డ దేవి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు నిబంధనలు పాటించని వాహన చోదకుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు రికార్డులు కలిగి ఉండాలని ఎస్సై దేవి తెలిపారు. కార్లలో వెళ్లేవారు తప్పకుండా సీట్‌బెల్ట్ ధరించాలన్నారు.

ఆమెకు శుభాకాంక్షలు..

ఆమె తల్లిలా లాలిస్తుంది... చెల్లిలా తోడుంటుంది.. భార్యగా బాగోగులు చూస్తుంది... కుటుంబ భారాన్ని మోస్తూ సర్వం త్యాగం చేస్తుంది... అంతటి గొప్ప స్త్రీ మూర్తికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనసారా శుభాకాంక్షలు తెలియజేశారు.. మహిళా దినోత్సవాన్ని బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు సన్మానాలు చేయడంతో పాటు పలు కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసి మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

– ఎస్.కోట/గజపతినగరం/చీపురుపల్లి నెట్‌వర్క్



శృంగవరపుకోట: మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు



జామి: డాక్టర్ భాగ్యరేఖను సన్మానిస్తున్న సిబ్బంది



గజపతినగరం రూరల్: మురపల్లిలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి



గుర్ల: ఎంపీపీ పొట్నూరు ప్రమీలను సత్కరిస్తున్న మహిళలు



చీపురుపల్లి రూరల్: మహిళా పోలీస్‌ను సన్మానిస్తున్న సీఐ సంజీవరావు



కొత్తవలస: జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీదేవిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు



గజపతినగరం: ఏరియా ఆస్పత్రిలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు



బొండపల్లి: గొట్లాం గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న న్యూ ఏజ్ స్పిరిచ్యువల్ మాస్టర్ వంశీకిరణ్

పెట్టుబడులు రావడం గొప్ప విషయం

● ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడం గొప్ప విషయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సమ్మిట్ విజయవంతం కావడంతో బుధవారం స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మంటపంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెట్టుబడులకు ఆంధ్రా బెస్ట్ చాయిస్ అనేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నమ్మకం కల్పించారన్నారు. ఒకే రోజు 352 ఎంఓయూలు చేసుకోవడం దేశంలోనే ఒక రికార్డ్ అని చెప్పారు. వివిధ కంపెనీలు ఏర్పాటు వల్ల ఆరు లక్షల మందికి ప్రత్యక్షంగా.. పది లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కలగనుందని తెలిపారు. విశాఖకు అంతటి భాగ్యాన్ని కల్పించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర ప్రజలు రుణపడి ఉండాలన్నారు. ముఖ్యమంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయబోయే పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీగా ఎన్నుకుని, ఉత్తరాంధ్ర ఉనికి చాటాలని పిలుపునిచ్చారు. వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ, విశాఖ అభివృద్ధికి కంకణం కట్టుకున్న జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఎస్.కోట వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, గొర్లె రవికుమార్, కె.వెంకటరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సీహెచ్ పద్మావతి, పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్ మెరపుల సత్యనారాయణ, పుణ్యగిరి ట్రస్టు బోర్డు చైర్మన్ పి.రామకృష్ణ, మోపాడ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్‌గా 'మెరపల'



మెరపల సత్యనారాయణ

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మెరపల సత్యనారాయణ పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు పంచాయతీరాజ్ విభాగానికి జోనల్ ఇన్‌చార్జిగా నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా మెరపల బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, సీఎం జగన్ మోహన్‌రెడ్డి నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. అలాగే రాజ్యసభ సభ్యుడు విజయ్ సాయిరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, రాష్ట్ర బీసీ వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలనాయుడుబాబు, తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

మహిళలకు సన్మానం



మహిళను సన్మానించిన గ్రామపెద్ద అప్పలనాయుడు

వేపాడ: మండంలంలోని జాకేరులో పలువురు మహిళలను వైఎస్సార్‌సీపీ నాయకుడు బుద్దా అప్పలనాయుడు సన్మానించారు. జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గ్రామంలో వృద్ధులైన మహిళలను, కుటుంబానికి ఆసరాగా నిలిచిన పలువురు మహిళలను సత్కరించారు.

నేడు ర్యాలీ

దత్తిరాజేరు: మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులతో పాటు, పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా మజ్జి గౌరమ్మ యాత్ర

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లిలో మజ్జిగౌరమ్మ యాత్ర బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గజపతినగరం రూరల్: మండలంలోని పాతబగ్గాం గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో లెంక అశోక్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నప్పటికే 70 శాతం గడ్డివాము తగలబడిపోయినట్లు అగ్నిమాపక అధికారి రవి తెలిపారు. ఆకతాయిలే గడ్డివాముకు నిప్పంటించి ఉంటారని అంతా భావిస్తున్నారు. రూ.40 వేలు వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.

జోరుగా అభివృద్ధి పనులు

గుర్ల: మండలంలోని చింతలపేటలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. పెద్దజమ్ము వీధిలో సుమారుగా రూ.ఏడు లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు సర్పంచ్ పతివాడ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు జమ్ము అప్పలనాయుడు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట గ్రామ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో (బాలికలు) 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 24 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రాత పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఏప్రిల్ 23న ఉదయం ఐదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం ఇంటర్ విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో తరగతిలో 80 సీట్లు ఉన్నాయన్నారు.

ప్రశంసాపత్రాల అందజేత



విజేతలతో ప్రిన్సిపాల్ రవి, తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గత నెలలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో విజేతలుగా దుర్గాప్రసాద్ సరాఫ్ సీనియర్ సెకండరీ హైస్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ రవి బుధవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 10 నుంచి 12వ తేదీ వరకు ఎలమంచిలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

'మెరపుల'కు సన్మానం

శృంగవరపుకోట: వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్‌గా నియామకమైన మెరపుల సత్యనారాయణను బుధవారం స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మంటపంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సన్మానించారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా భాధ్యతలు నిర్వహిస్తున్న సత్యనారాయణను పార్టీ అధిష్టానం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించడంపై ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జామి, ఎస్.కోట, వేపాడ, కొత్తవలస మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వాసుదేవరావు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని డిప్యూటీ ఈఓ వాసుదేవరావు అన్నారు. మండలంలోని వెదుళ్లవలసలో ఆయన బుధవారం పర్యటించి పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● సబల కార్యదర్శి సరస్వతి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సబల సంస్థ కార్యదర్శి సరస్వతి, తదితరులు

కొత్తవలస: మహిళలు ఆర్థికంగా ఎదిగిన నాడే అభివృద్ధి సాధ్యమని సబల సంస్థ కార్యదర్శి ఎం.సరస్వతి అన్నారు. మండలంలోని వియ్యంపేట పంచాయతీ శివారు కొటానివానిపాలెంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం సహకారంతో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రానికి పార్వతీపురం మన్యం జిల్లా రస్తాకుంటుబాయి గ్రామానికి చెందిన కృషివిజ్ఞాన కేంద్ర ప్రతినిధులు పది మిషన్లు సమకూర్చారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం బాగుంటుందని చెప్పారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి టీఎస్ఎస్‌కే పాత్రో, మహిళలు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



క్రియాధ్యాన మందిరంలో మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వహకులు

శృంగవరపుకోట: పట్టణంలోని మహావతార బాబాజీ క్రియా ధ్యాన మందిరంలో పేద మహిళలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు లక్ష్మీ మాతాజీ తెలిపారు.

సిద్ధమైన గంగమ్మ తల్లి ఆలయం



పూర్ణకలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

దత్తిరాజేరు: మండలంలోని మరడాంలో గంగమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పోతల రామలక్ష్మి, శంకరరావు దంపతులు ఆధ్వర్యంలో ఆలయ పూర్ణ కలశాన్ని ఊరేగించారు. గంగమ్మ విగ్రహాన్ని గురువారం ప్రతిష్టించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ప్రతి పశువుకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకా

● పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ చలపతిరావు



పశువుకు గర్భకోశ చికిత్స చేస్తున్న ఏడీఏ చలపతిరావు

వేపాడ: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయాలని ఎస్.కోట పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ బి. చలపతిరావు సూచించారు. మండలంలోని బానాదిలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెలాఖరు వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. ఎస్.కోట మండలంలో 15,300, వేపాడ మండలంలో 17,450 పశువులకు టీకాలు వేసేందుకు గుర్తించామని, అవసరమైన వ్యాక్సిన్ సిద్ధంగా ఉందని చెప్పారు. రాయితీపై పంపిణీ చేస్తున్న టీఎంఆర్ పశువుల దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్.కోట, వేపాడ మండలాల్లో ఇప్పటి వరకు 150 టన్నుల దాణా సరఫరా చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సింహాచలం, గోపాలమిత్రలు, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

మహిళల ఆత్మగౌరవ రక్షణే నాగరికత



ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

శృంగవరపుకోట: మహిళల ఆత్మగౌరవాన్ని రక్షించడమే నిజమైన నాగరికతని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు మద్ది మాణిక్యం అన్నారు. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సీపీఐ కార్యాలయం వరకు బుధవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ, మహిళా దినోత్సవానికి 108 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. 1909లో సోషలిస్టు పార్టీ నేతృత్వంలో న్యూయార్క్‌లో 15 వేల మంది మహిళలు హక్కుల కోసం పోరాడి గెలిచారన్నారు. 1917 యుద్ధ సమయంలో రష్యా మహిళలు ఆహారం – శాంతి కోసం పోరాడిన రోజును అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నేతలు షేక్ చాంద్‌బీబీ, ఎ.పార్వతి, వి.లక్ష్మి, ఎస్.విజయ, ఎ.ఉమ, పి.సత్య, షేక్ బీబీ, తదితరులు పాల్గొన్నారు.

ఆడి పిల్లలకు ప్రత్యేక రక్షణ

● జూనియర్ సివిల్ జడ్జి సూర్యకిరణ్‌శ్రీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి సూర్యకిరణ్‌శ్రీ

కొత్తవలస: అడుగడుగునా ఆడపిల్లలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పిస్తోందని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ అన్నారు. మండలంలోని అడ్డూరివానిపాలెం సమీపంలో గల కస్తూరీబా ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని, అయితే అటువంటి చట్టాలపై ముందు అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని బాగా చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఎస్సై బొడ్డు దేవి మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో మగవారితో సమానంగా ఆడవాళ్లు దూసుకుపోతున్నారని తెలిపారు. పలువురు మహిళా న్యాయవాదులు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి కొట్యాడ విజయలక్ష్మి, న్యాయవాదులు రాజారావు, ఎంవీఎస్ గిరి, శ్రీనివాసరావు, ఉమాదేవి, లలిత, గవర కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం



దౌడు తీస్తున్న గుర్రం

వేపాడ: మండలంలోని సోంపురంలో ముత్యాలమ్మ తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. జాతరలో భాగంగా నిర్వహించిన గుర్రప్పందాలు ఆకట్టుకున్నాయి. కొట్యాడ తలారికి చెందిన సింగపూర్ సత్యనారాయణ గుర్రం ప్రథమ స్థానంలో నిలవగా... అలమండ శ్రీనురాజు గుర్రం ద్వితీయ, కొట్యాడ తలారీకి చెందిన ఎస్.సత్యనారాయణ గుర్రం తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

జోరుగా ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజును గెలిపించడం వల్ల ఉత్తరాంధ్రకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనను చూసి సీతంరాజుకు మద్దతు తెలియజేయాలని కోరారు.

– ఎస్.కోట/గజపతినగరం నెట్‌వర్క్



జామి: జాగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావు



గజపతినగరం: ఇంటింటా ప్రచారం చేస్తున్న గజపతినగరం నాయకులు



ఎస్.కోట: ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తవలస: స్టీల్ ఎక్స్చేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారంలో సీతంరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు



వేపాడ: సోంపురం,అరిగిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు